నేటి దినపత్రిక

# సూర్య

## కర్నూలు | నంద్యాల

మంగళవారం | 05 డిసెంబర్ 2023 | పేజీలు 8


రాష్ట్ర మాజీ సీఎం చంద్రబాబు

# శ్రీశైలం పర్యటన రద్దు


చంద్రబాబునాయుడు

**శ్రీశైలం, మేజర్‌న్యూస్:**

టిడిపి జాతీయ అధ్యక్షులు,రాష్ట్ర మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు శ్రీశైలం పర్యటన రద్దయినట్లు టిడిపి నాయకులు పేర్కొన్నారు.ఆయన శ్రీశైలం పర్యటనకు సంబంధించి షెడ్యూల్ విడుదలైనప్పటికీ తుఫాను ప్రభావంతో పర్యటన వాయిదా పడింది.నేటి మంగళవారం ఉదయం బేగంపేట్ ఎయిర్ పోర్ట్ నుండి ప్రత్యేక హెలికాప్టర్లో ఆయన సున్నిపెంటకు చేరుకొని కాన్వాయ్ ద్వారా శ్రీశైలం చేరుకునేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. అయితే తుఫాను ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో చిరుజల్లులు కురుస్తుండటంతో వాతావరణ పరిస్థితుల కారణంగా ఆయన పర్యటన రద్దయినట్లు మిగతా 2లో

# ఇక్కడా మార్పుంటుందా?

- సిట్టింగుల్లో కొందరికి టికెట్లు నిరాకరించనున్న వైకాపా
- 2019లో పోటీ చేసిన వారిని కాదని కొత్తవారికి టికెట్లు ఇవ్వనున్న తెదేపా
- ఆరు గ్యారెంటీలపై తెదేపా ఆశలు
- ఇప్పటికే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే గెలిపిస్తాయంటున్న వైకాపా
- ఇక్కడా ప్రభుత్వ వ్యతిరేకత ఉందా? అంచనాలేసుకుంటున్న పార్టీలు
- తెలంగాణా ఎన్నికలతో ప్రజల 'మూడ్'పై పార్టీల సర్వేలు
- వేడి రేపిన పక్క రాష్ట్ర ఎన్నికల ఫలితాలు


జగన్మోహన్‌రెడ్డి


చంద్రబాబునాయుడు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో**

ఎగ్జిట్‌పోల్స్ అంచనా వేసినట్లుగానే కాంగ్రెస్‌పార్టీ తెలంగాణాలో అధికార పగ్గాలు చేపట్టింది. దక్షిణాది రాష్ట్రమైన కర్నాటకలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయఢంకా మోగించిన కాంగ్రెస్‌పార్టీ తెలంగాణాలో కూడా విజయం సాధించడం ఆ పార్టీకి ఊపిరిపోసింది. అయితే, దేశవ్యాప్తంగా జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఆదివారం నాలుగు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు పూర్తి కాగా, మూడు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ విజయఢంకా మోగించింది. కర్నాటకలో విజయం తెలంగాణా ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి కలిసి రాగా, మరో ఐదు నెలల్లో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు జరగనున్న ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తెలంగాణాలో మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లోనూ అధికార మార్పిడి ఖాయమన్న ఆశలు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. తెలుగుప్రజలు మార్పును కోరుకుంటున్నారని తెదేపా అంచనా వేస్తోంది. అధికార పక్షమైన వైకాపాలో తెలంగాణా ఎన్నికల ఫలితాలు కొంత అలజడిని సృష్టించాయనే చెప్పాలి. ఆయితే, అక్కడ ప్రభుత్వం ఏర్పాటై 10 సంవత్సరాలు గడిచిన కారణంగా ఓటర్ల అసంతృప్తికి కారణమై ఉండవచ్చని, ఇక్కడ అలాంటి పరిస్థితి ఉండదని వైకాపా నేతలు సర్దిచెప్పుకుంటున్నారు.

పక్క రాష్ట్రంలో ఎన్నికలు పూర్తయి ఫలితాలు వెలువడిన వెంటనే ఇక్కడా ప్రజల 'మూడ్' ఎలా ఉండబోతోందన్న ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కునే పనిలో పడ్డాయి రాజకీయపక్షాలు. భారసా ఓటమికి కారణాలను అధికార వైకాపా సమీక్షించుకుంటుంటే... ప్రతిపక్ష తెదేపా కాంగ్రెస్‌పార్టీ విజయానికి కారణాలను అన్వేషిస్తోంది. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో 'బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో ఓటర్ల ముంగిట్లోకి వెళుతోంది. రూ. 500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆయా జిల్లాల వరకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణాలు, ఉద్యోగ ఖాళీల భర్తీలకు నోటిఫికేషన్, నిరుద్యోగ భృతి లాంటి ఆకర్శణీయ పథకాలను ప్రకటించిన తెదేపా మేనిఫెస్టోలో ఇది తమ తొలి అడుగేనని, ఎన్నికల నాటికి అనేక పథకాలు మిగతా 2లో



- శివనామస్మరణతో హోరెత్తిన శ్రీగిరి
- పాతాళగంగలో భక్తుల పుణ్యస్నానాలు
- అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- వర్షం కారణంగా లక్షదీపోత్సవం-పుష్కరిణి హారతి నిలుపుదల

శ్రీశైలానికి

# పోటెత్తిన భక్తజనం

**శ్రీశైలం, మేజర్ న్యూస్:**

కార్తీక మాసం మూడవ సోమవారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం వేలాది మంది భక్తులు శ్రీశైల క్షేత్రానికి చేరుకున్నారు. శ్రీశైలంకి పోటెత్తిన భక్తజనం మిగతా 2లో


శివునికి ప్రీతికరం.... ఈ దీపం


సాంప్రదాయం నృత్యం చేస్తున్న కళాకారులు

మహానంది క్షేత్రంలో

# భక్తజన సందోహం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- భక్తులకు అన్నదానాలు

**మహానంది మేజర్‌న్యూస్:**

మహానంది పుణ్యక్షేత్రం భక్తజన సందోహంతో కిక్కిరిసి పోయింది. కార్తీకమాసం మూడవ సోమవారం రోజున వేలాది మంది భక్తులు శ్రీ కామేశ్వరీ సమేత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుండే క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు ఆలయంలోని పుష్కరణీలలో మిగతా 2లో


మహానంది క్షేత్ర పరిసరాలలో క్యూ లైన్లలో పుష్కరణీలలో భక్తుల రద్దీ

శ్రీశైల మల్లన్న సేవలో

# మంత్రి సీదిరి అప్పలరాజు


ఆలయ ప్రాంగణంలో మంత్రి అప్పలర్శాజు

**శ్రీశైలం, మేజర్‌న్యూస్:**

కార్తీక మూడవ సోమవారాన్ని పురస్కరించుకొని శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద ఆయనకు ఏఈఓ హరిదాస్, అధికారులు, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. శ్రీస్వామిఅమ్మ వార్ల ప్రత్యేక పూజలు అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనలు వల్లించగా అధికారులు శేష వస్త్రాం, లడ్డు ప్రసాదాలు, జ్ఞాపికతో మంత్రిని సత్కరించారు.

# ఇక్కడా మార్పుంటుందా?

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటిస్తామని చెబుతోంది. కర్నాటక, తెలంగాణాలో కాంగ్రెస్‌పార్టీ విజయ ఫార్ములాను తెదేపా అనుసరించబోతోందన్నది స్పష్టమవుతోంది. 2024 ఎన్నికల్లో ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా తెదేపా అడుగులు వేస్తోంది.



అధికార వైఎస్సార్సీపి తెలంగాణా ఎన్నికల ఫలితాలతో కొంత ఆందోళనకర పరిస్థితికి చేరుకుంది. సిపిఎస్ రద్దు వ్యవహారంపై ఉద్యోగుల్లో వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత ఎన్నికల ఫలితాలపై చూపించవచ్చని వైసీపీ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల కాలంలో తమ ప్రభుత్వం అందించిన అనేక సంక్షేమ పథకాలు, ముఖ్యంగా నగదు బదిలీ గ్రామీణ ఓటర్లను తమకు అనుకూలంగానే ఉంచేలా చేస్తుందని వైసీపీ అంచనా వేస్తోంది. తెలంగాణాలో పట్టణ ఓటర్లు ఎలాగైతే ఓటు వేసేందుకు బయటకు రాలేదో ఇక్కడా వాళ్లలో ఓటేసే వారి సంఖ్య తక్కువగానే ఉంటుందని, ఇది తమకు పెద్దగా నష్టం కలిగించదని వైసీపీ అంచనా వేస్తున్నట్లు సమాచారం. తెలంగాణాలో సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో చాలా మందిపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నా వారికే టికెట్లు ఇవ్వడంతో భారసా ఓడిపోయిందన్న సమీక్షల నేపథ్యంలో చాలా మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఇక్కడ వైసీపీ టికెట్లు కేటాయించకపోవచ్చునన్న సమాచారం సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో ఆందోళన కలిగిస్తోంది. గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెబుతూ వస్తున్న మాటలు ఇక్కడ ప్రస్తావనార్హం. ఎన్నికల సమయానికి వైకాపా సైతం మరిన్ని కొత్త సంక్షేమ పథకాలతో కార్యక్షేత్రంలోకి దిగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో గెలుపు బాట పట్టిన భాజపా ఇచ్చిన హామీలను కూడా ఇటు అధికార పక్షం, అటు ప్రతిపక్షం పరిశీలిస్తున్నాయి.

తెలంగాణా ఎన్నికల ఫలితాలను కర్నూలు జిల్లాకు చెందిన నేతలు కూడా సమీక్షించుకుంటున్నారు. జిల్లాకు ఆనుకుని ఉన్న ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో అధికార పార్టీ భారసాకు భంగపాటు జరిగిన తీరును వారు పరిశీలిస్తున్నారు. తెలంగాణాలో భాగమైనా ఉమ్మడి మహబూబ్‌నగర్, ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజల మధ్య సంబంధ బాంధవ్యాలు ఎక్కువేనని చెప్పాలి. ఇద్దరి ప్రజల మనోభావాలు ఒక్కటేలా ఉంటాయన్న అంచనాలు కూడా ఉన్న నేపథ్యంలో అక్కడి ప్రజలు మార్పు కోరుకున్నట్లు ఇక్కడా జరుగుతుందా? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లా 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్సీపి అనుకూలంగా వ్యవహరించింది. 2019 ఎన్నికల్లో అధికార వైకాపా క్లీన్‌స్వీప్ చేసింది. 14 ఎమ్మెల్యే స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాలను ఆ పార్టీ తన జేబులో వేసుకుంది. ఇంతటి క్లీన్‌స్వీప్ గతంలో ఏ పార్టీకి దక్కలేదు. ఎన్టీఆర్ తెదేపాను ప్రారంభించిన రోజుల్లోనూ ఇంతటి విజయం దక్కలేదన్నది గమనార్హం. రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలోనూ తెదేపాకు కర్నూలు జిల్లా నుండి సంపూర్ణ మద్దతు లభించలేదు.

ఉమ్మడి కర్నూలు జిల్లా అధికార వైకాపాకు కీలకంగా కనిపిస్తోంది. 2019 ఎన్నికల నాటి ఫలితాలను 2024 ఎన్నికల్లోనూ రాబట్టుకోకపోతే రాష్ట్రంలో అధికార పీఠమెక్కడం అంత సులభం కాదన్నది వైకాపా అంచనాగా కనిపిస్తోంది. ఇందు కోసం అవసరమైతే కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరించే పరిస్థితి కనిపిస్తోంది. ఇది సిట్టింగ్‌లకు ఆందోళన కలిగిస్తోంది. ఏడాదికి ముందు నుండే ప్రజల్లోకి వెళ్లాలని నిశ్చయించుకున్న అధికార వైకాపా 'గడప గడపకు వైకాపా ప్రభుత్వం' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. ప్రతి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలవాలని, వారికి సంక్షేమ పథకాలు అందకపోతే అందేలా చూడాలని, వైకాపా ప్రభుత్వం ఆ ఇంటికి ఎంత మేరకు సంక్షేమ పథకాల పేరుతో లబ్ధి చేకూర్చిందన్నది వివరించాలని నిర్దేశించింది. దీన్ని అమలు చేయడంలో జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేలు నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారంటూ, వారికి టికెట్లు ఇవ్వబోమంటూ సిఎం జగన్ అనేక సార్లు సమీక్షల్లో ముఖాముఖిగానే చెప్పిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. ఇప్పుడు పార్టీలో ఇది చర్చనీయాంశంగా మారింది. సిట్టింగ్‌ల్లో టికెట్లు దక్కని వారు ఎందరుంటారన్నది ఆసక్తికరంగా మారింది.



మంత్రి గుమ్మనూరు జయరాంను ఈ మారు కర్నూలు పార్లమెంట్ నుండి పోటీ చేయించవచ్చంటూ ప్రచారం జరుగుతోంది. సిట్టింగ్ ఎంపి డాక్టర్ సంజీవ్‌కుమార్ ఈ విషయాన్ని గతంలోనే ప్రకటించారు కూడా. అయితే, తాను ఆలూరు నుండే పోటీ చేస్తానని గుమ్మనూరు తన అనుచరులతో చెబుతుండడం ఆసక్తికరంగా మారింది. అలాగే నంద్యాల ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డికి కూడా టికెట్ నిరాకరిస్తారన్నది ప్రచారంలో ఉంది. సిట్టింగ్‌లను మార్చే అవకాశాలను అంచనా వేస్తున్న ఎమ్మెల్యేలు ఇప్పటికే తమ వారసుల పేర్లు ప్రచారంలోకి తెచ్చారు. వారికి టికెట్లు ఇవ్వాలంటూ అధిష్టానం ముందు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. మరి అధిష్టానం ఈ ప్రతిపాదనలకు ఓకే అంటుందా? లేక పూర్తిగా సిట్టింగ్ ఎమ్మెల్యేల కుటుంబాలను పక్కన పెడుతుందా? అన్నది చూడాలి. మరి ప్రతిపక్ష తెదేపా ఈ మారు ఎన్నికల్లో గతంలో టికెట్లు ఇచ్చిన వారికే ఇస్తుందా? లేక కొందరు కొత్తవారిని రంగంలోకి తెస్తుందా? చూడాలి. నంద్యాల జిల్లాలోని నంద్యాల శాసనసభ స్థానానికి గతంలో భూమా బ్రహ్మానందరెడ్డి తెదేపా నుండి పోటీ చేస్తే రాబోయే ఎన్నికల్లో ఆయనకు పార్టీ టికెట్ నిరాకరించింది. ఆయన స్థానంలో మైనారిటీ నేత ఎన్ఎండి ఫరూక్‌కు టికెట్ కేటాయిస్తున్నట్లు తేల్చేసి ంది. ప్రస్తుతానికి ఒక్క నియోజకవర్గంలో మార్పు తీసుకు వచ్చిన ఇలాంటి ప్రయోగాలు మరెన్ని నియోజకవర్గాలపై చేస్తుందన్నది తెదేపాలో ఉత్కంఠను రేపుతోంది. తెలంగాణా ఎన్నికల ఫలితాలు ఇక్కడి రాజకీయాలపై పెను ప్రభావం చూపించబోతోందన్నది మాత్రం అక్షరసత్యం.

# మహానంది క్షేత్రం భక్తజన సందోహం

(మొదటిపేజీ తరువాయి)



పుణ్యస్నానాలు ఆచరించి క్యూ లైన్లలో వేచివుండి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో స్వామివార్లకు అభిషేకాలు, కేదారేశ్వర స్వామి నోములు నిర్వహించారు. మహిళలు ఆలయంలోని నాగులకట్ట, నంది స్తూపం, కోనేరుల పరిసర ప్రాంతాలలో కార్తీక దీపాలను వెలిగిస్తూ భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్ర పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆలయ పర్యవేక్షణ చేస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.





**భక్తులకు అన్నదానాలు :** కార్తీక మూడవ సోమవారం రోజున మహానంది పుణ్యక్షేత్రానికి తరలివచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రథశాల వద్ద తిమ్మాపురం గ్రామానికి చెందిన ఒంటెద్దు వీరారెడ్డి తన మిత్ర బృందంతో కలిసి, గరుడ నందీశ్వర స్వామి ఆలయం వద్ద శేఖర్, సుదర్శన్, సాయి, ప్రవీణ్, లక్ష్మణ్‌లు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఈ అన్నదానాలను ప్రారంభించారు. వేలాదిమంది భక్తులకు నిర్విరామ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నవ నందులను భక్తులు కాలినడకన, వాహనాలలో దర్శించుకున్నారు.

# సాయుధ దళాల అభివృద్ధికి విరాళాలు ఇవ్వండి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** దేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 7వ తేదీన సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని జరుపుకుంటామని సాయుధ దళాల సిబ్బంది అభివృద్ధి కోసం పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు విరివిగా విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జిల్లా సైనిక్ బోర్డు సంక్షేమ అధికారి ఎస్ ఆర్ రత్నరూతతో కలిసి సాయుధ దళాల పతాక స్టిక్కర్స్, ఫ్లాగ్స్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా సైనిక్ బోర్డు సంక్షేమ అధికారి మాట్లాడుతూ సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని దళాల సిబ్బంది అభివృద్ధి కోసం విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావాలన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 7వ తేదీన సైనిక జెండా దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. సాయుధ సిబ్బంది అభివృద్ధి కోసం భారతీయ జెండా స్టిక్కర్స్, కార్‌ఫ్లాగ్స్‌ను, ఇతర వస్తువులను విక్రయించి నిధులను సేకరిస్తారన్నారు. ఫ్లాగ్ డే సందర్భంగా సేకరించిన నిధులను యుద్ధంలో మరణించిన వారి పునరావాసం కోసం కూడా ఉపయోగిస్తారన్నారు.

### రాష్ట్ర మాజీ సీఎం చంద్రబాబు

# శ్రీశైలం పర్యటన రద్దు

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. గత కొద్దిరోజులుగా చంద్రబాబు దంపతులు వరుసగా పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్నారు. అందులో భాగంగా తిరుపతి వెంకన్న స్వామి,విజయవాడ కనకదుర్గ అమ్మవారిని, సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకున్నారు.ప్రస్తుతం వాయిదా పడిన శ్రీశైలం మల్లన్న దర్శనం కూడా త్వరలోనే ఉంటుందని నాయకులు పేర్కొన్నారు.

# కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రావాలి

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షులు దాసరి చింతలయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏపీ సీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్‌రావు మాట్లాడుతూ తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసిన అధి నాయకత్వానికి, నాయకులకు కార్యకర్తలకు తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయాన్ని సాధించిందని మోదీ ప్రభుత్వం పదవి వినియోగించి ఈడీలను ప్రయోగించి మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో అనైతికంగా విజయం సాధించారన్నారు. కర్నాటకలో బీజేపీ నుంచి అధికారాన్ని దక్కించుకున్నదని అదే విధంగా తెలంగాణాను బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పరం చేసుకోగలిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ చాలా ఉత్సాహంగా ఉందని రాబోయే 2024 ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఇండియా కూటమితో కేంద్రంలో తప్పనిసరిగా రాహుల్ గాంధీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని ఈ ఎన్నికలను చూసి ప్రజలు నిరుత్సాహం పడవద్దన్నారు. ఈ కార్యక్రమం లో పార్టీ సేవా దళ్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్‌ఖాన్ మైనారిటీ నాయకులు సయ్యద్ రియాజ్ బాషా, రాష్ట్ర అధికార ప్రతినిధి ఊకొట్టు వాసు, జిల్లా కోశాధికారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలానికి పోటెత్తిన భక్తజనం



శివకాంతులు

(మొదటిపేజీ తరువాయి)

శివనామస్మరణతో మల్లన్న క్షేత్రం మార్మోగింది. వేకువజామునే పవిత్ర పాతాళగంగలో పుణ్య స్నానాలాచరించిన భక్తులు కార్తీకదీపారాధన, ప్రత్యేక నోములు నోమకుని మల్లన్న దర్శనానికి బారులుదీరారు.భక్తుల రద్దీతో ఆలయ శీఘ్ర,అతిశీఘ్ర దర్శన క్యూలన్నీ నిండిపోయాయి. భక్తులందరికీ స్వామివారి సౌకర్యవంతమైన దర్శనం కలిగేలా స్వామివారి అలంకార దర్శనాన్ని మాత్రమే భక్తులకు కల్పించారు. ఆలయ క్యూలైన్లలో వేచి ఉన్నభక్తులకు అల్పాహారం, తాగునీరు,వేడిపాలు,బిస్కెట్లు పంపిణీ చేశారు.దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు దర్శన క్యూలైన్లను, ఆర్జిత సేవా క్యూలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పలు సూచనలు చేశారు.భక్తులందరు కార్తీకదీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయ ఉత్తర మాడవీధి, గంగాధర మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.అన్నదాన భవనంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6.30 గంటల నుంచి అల్పాహారం అందజేశారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

కార్తీకమాసం సందర్భంగా శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన్న సత్యం శిష్య బృందం,కల్పన వారి బృందం, మద్రాసు వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన,శ్రీ లలితా భవాని వెంకట నృత్యాలయం, గుంటూరు వారిచే సంప్రదాయ నృత్య కార్యక్రమాన్ని నిర్వహించారు.



శివయ్యా... అందుకోవయ్యా

**అన్నప్రసాద వితరణకు రూ.2 లక్షల విరాళం**

భక్తుల సౌకర్యార్థం శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద వితరణ పథకానికి ఒంగోలు పట్టణానికి చెందిన అపూర్వ కన్స్ట్రక్షన్ సురేష్ రూ.1,00,500,బెంగళూరుకు చెందిన ఆశ్రిత్ పి.అశోక్ రూ.1,00,500 విరాళాలను దేవస్థానం ఏఈవో ఫణిధర ప్రసాద్కు అందజేశారు.ఈ సందర్భంగా దాతలను దేవస్థానం తరపున శేష వస్త్రం,లడ్డు ప్రసాదాలతో అందజేసి సత్కరించారు.

**వర్షం కారణంగా లక్ష దీపోత్సవ-పుష్కరిణి హారతి నిలుపుదల**

కార్తీక మాసం సోమవారాలలో శ్రీశైలం ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం-పుష్కరిణి హారతి కార్యక్రమాలను దేవస్థానం కనుల పండువగా నిర్వహిస్తుంది. తుఫాను ప్రభావంతో శ్రీశైలంలో వర్షం కురుస్తుండటంతో సోమవారం సాయంత్రం నిర్వహించాల్సిన లక్ష దీపోత్సవం-పుష్కరిణి హారతి కార్యక్రమాలలో నిలుపుదల చేశారు.

## రైతులు అప్రమత్తంగా ఉండాలి..ఏఓ.వరప్రసాద్



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** మిచౌంగ్ తుఫాను ప్రభావంకారణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి వరప్రసాద్ అన్నారు. సోమవారం పెద్దకడుబూరు మండలంలో రైతులు సాగు చేసిన వరి.మిరప. వంటి పంటలను ఆయన సిబ్బందితో వెళ్లిపరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు రేపు కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమ జిల్లాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని అందువల్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన రైతులకు సూచించా రు. అలాగే గింజ గట్టిబడి కోతకు సిద్ధంగా ఉన్న వారిని సత్వరమే కంబైన్డహార్వేస్టర్‌ను ఉపయోగించి వచ్చిన ద్యాన్యాన్ని సురక్షితమైన ప్రాంతంలో వర్షాలుకు తడవ కుండా ఆరబెట్టుకోవాలని ఆయన రైతులకుసూచించారు. పత్తి. మిరప పంట చేలో వర్షపు నీరు నిల్వ కుండా వర్షపు నీటిని వేగంగా సులువుగా పోయే విధముగా చేల గట్లలోఎక్కువ సంఖ్య లోవాలు నిలువగా చేయటం మంచిదని ఆయన అన్నారు. పత్తి తీతకుసిద్ధమైన. కాయలనుండి పత్తిని తీయడం మిరపలో తయారైన మిరపను పండు మిరపను పొలము నుండి కోసి అధిక వర్షముల నుండి కాయలు తడవకుండా. బూజు పట్టకుండా కాపాడు వచ్చునని ఆయన రైతులకు సూచించారు.

## ఐదుమంది దొంగలు అరెస్టు

**– రూ.5లక్షలు విలువ చేసే కరెంటు వైర్లు స్వాధీనం**

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలోని టిడ్కో ఇళ్లలో ఉన్న కరెంటు వైర్లను దొంగలించిన 5మంది దొంగలను అరెస్టు వారి వద్ద నుంచి రూ.5లక్షలు విలువ చేసే కరెంటు వైర్లు దొంగలించినట్లు తాలూకా సీఐ శ్రీరామ్ తెలిపారు. గత కొంతకాలంగా నంద్యాల జిల్లాకు చెందిన 5మంది దొంగలు టిడ్కో ఇళ్లలో కరెంటు వైర్లను అపహరించుకొని వెళ్తున్నారన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు. నంద్యాల జిల్లాకు చెందిన 5మంది దొంగలను సోమవారం సఫా ఇంజనీరింగ్ కళాశాల వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5లక్షలు విలువ చేసే కరెంటు వైర్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

## అంత్యక్రియలకు వెళ్లి శవమైన వ్యక్తి

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** నగరంలోని ధర్మపేటకు చెందిన గోవిందు(39) శవమై కనిపించాడని రెండవ పట్టణ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గోవిందు అనే వ్యక్తి మూడురోజుల క్రితం తన స్నేహితుడు రమేష్ అనారోగ్యంతో చనిపోవడంతో అతని అంత్యక్రియలకు సుంకేసుల రోడ్డులోని స్మశానవాటికకు వెళ్లాడు. అక్కడ అతిగా మద్యం సేవించాడు. అందరూ తిరిగి రాగా గోవిందు అక్కడే ఉన్న గుంతలో పడటంతో ఎవరికి కనిపించలేదు. గోవిందు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు స్మశానవాటికలో శవమై కనిపించాడని, అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు 2వ పట్టణ సీఐ తెలిపారు.

## చాగలమర్రిలో చైన్ స్నాచింగ్



**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** చాగలమర్రి పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన వెంకట సుబ్బయ్య,లక్ష్మీదేవి దంపతులు భీమలింగేశ్వరస్వామి ఆలయానికి వెలుతుండగా సమీప కాలనీలో గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలోని గొలుసును లాక్కెళ్ళిన సంఘటన సోమవారం తెల్లవారుఝూమున చోటుచేసుకొంది.ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన దంపతులు కాలినడకన ఆలయానికి బయలు దేరినారు.పాత ఎస్సీ కాలనీ సమీపానికి చేరుకోగానే దుండగుడు ఆమె మెడలోని గొలుసును గుం జడంతో మూడు ముక్కలుగా విరిగి పడి ఒక్క భాగం దుండగుడి చేతిలో పడింది. దుండగుడు అక్కడి నుంచి ద్విచక్ర వాహనంలో పారిపోయాడు.దాదాపు 2 తులాల బంగారు గొలుసు చోరికి గురైందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసారు.ఈ విషయంపై విచారణ చేపట్టామన్నారు.

## పల్లెల్లో పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలు



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల పరిధిలోని అనేక గ్రామాల్లో రాత్రి వేళల్లో వెలగాల్సిన వీధి దీపాలు పగలు పూట నిరంతరం వెలుగుతున్న అయా గ్రామ సర్పంచులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని అయా గ్రామాల ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ముఖ్యంగా మండలంలో ముచ్చిగేరి. హెచ్. మురువణీ. కంభళదహాల్. కంభళదిన్నే. జాలవాడీ. గంగులపాడు. దొడ్డిమేకల గ్రామం.కల్లుకుంట. పెద్దకడబూరు. బసలదొడ్డీ, గవి గట్టు,బాపులదొడ్డి. తదితర గ్రామాల్లో విద్యుత్ దీపాలు నిరంతరం వెలుగుతున్నందున పలు వీధుల్లో రాత్రివేళల్లో విద్యుత్ బల్బులు కాలిపోయి వీధులన్ని చీకటిమయంగా మారుతున్నాయని ప్రజలు తెలిపారు. అలాగే వీధి దీపాలు ఇలా వెలగడం వల్ల గ్రామపంచాయతీలకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని అందు వల్ల ప్రతి గ్రామాసర్పంచ్ జోక్యం చేసుకుని వీధి దీపాలు నిరంతరం వెలిగించకుండా అన్ ఆఫ్ ఏర్పాటు చేసుకున్నట్లైతే విద్యుత్ ఆదా అవుతుందని పలువురు చర్చించుకుంటున్నారు.

## ఘంటసాల పాటలు అజరామరం – మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** ఘంటసాల పాటలు అజరామరమని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. సోమవారంనాడు రాజారెడ్డి ఆధ్వర్యంలో ఘంటసాల 101వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ సంగీత సాహిత్య ప్రియులలో నేటికీ చరగని ముద్ర వేసుకున్న ఘంటసాల ఆలపించిన ఆణిముత్యాలను, మధుర గీతాలను గుర్తు చేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని నిరుపేద కుటుంబంలో ఘంటసాల వెంకటేశ్వరరావు జన్మించారని కటిక పేదరికం అనుభవిస్తూ తన పాటలతో జీవనం గడిపేవారన్నారు. అన్నమయ్య తరువాత ఏడు కొండలు వెంకటేశ్వరస్వామి ఎదుట కూర్చొని పాటలు పాడిన ఘనకీర్తి ఘంటసాలకే దక్కిందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఘంటసాల జయంతిని అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలన్నారు. వారు పాడిన పాటలు నేటికీ కూడా ఆదర్శప్రాయంగా నిలవడంతోపాటు ఘనకీర్తిని సంపాదించాయన్నారు. నేడు ఎంతో మంది గాయకులు భగవద్గీత స్లోకాలు ఆలపించినా ఘంటసాల మధు ఘంటాన్ని ఇప్పటికీ ఎవ్వరూ భర్తీ చేయలేరన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమమ సలాం, పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, వెల్కం అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మద్దూరు సుబ్బారెడ్డి జీవితం అందరికీ ఆదర్శం



మద్దూరు సుబ్బారెడ్డి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న అతిథులు

**నందికొట్కూరు మేజర్‌న్యూస్ :** నంద్యాల మాజీ పార్లమెంట్ సభ్యులు మద్దూరు సుబ్బారెడ్డి 11వ జయంతి బ్రాహ్మణకొట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 62వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం బ్రాహ్మణ కొట్కూరులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మద్దూరు సుబ్బారెడ్డి మనువడు మద్దూరు హరి సర్వోత్తమ రెడ్డి, మద్దూరు రామిరెడ్డి, మాజీ ఎంపీటిసి సభ్యులు ఖాజా మొహిద్దీన్, సర్పంచ్ మరియమ్మలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్దూరు సుబ్బారెడ్డి జీవితం అందరికీ ఆదర్శమని ఒక చిన్న గ్రామంలో జన్మించిన ఆయన వివిధ రాజకీయ పదవులను అలంకరించి జాతీయ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారని అన్నారు. ఆయన విద్యకు అధిక ప్రాధాన్యతను ఇచ్చేవారని జిల్లా వ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలలో ఉన్నత పాఠశాలల ఏర్పాటుకు ఆయన కృషి చేశారన్నారు. ఈ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు అభివృద్ధి చెంది తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటి చైర్మన్ పుల్లన్న, రిటైర్డు ఎంపీడిఓ రియాజుద్దీన్, అడ్వకేట్ రాజశేఖర్, పాఠశాల కమిటి వైస్ చైర్మన్ రాణమ్మ, కో ఆప్టెడ్ సభ్యులు ఖాజా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నమ్మకం దేనికి..భవిష్యత్తు ఎవరికి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాలలోని ఎస్‌డీపీఐ కార్యాలయంలో అసెంబ్లీ అధ్యక్షులు హనీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఫాజిల్ దేశాయి మాట్లాడుతూ గత 70సంవత్సరాలుగా పార్టీలు మారాయి. నాయకులు మారారు దాని పేద బడుగు బలహీన వర్గాల బతుకులు మాత్రం మారడం లేదు ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు నవరత్నాలని తీసుకున్నట్లు మన రాష్ట్ర ప్రభుత్వం అమి అమలు పరచడానికి సంవత్సరానికి 40వేల కోట్లకు పైబడి అప్పులు చేస్తున్నదని అన్నారు. దాని ప్రభావం ప్రజలపై పడి విద్యుత్ చార్జీలు, గ్యాస్ ధరల రూపంలో పెట్రోల్, డీజిల్ ధరలను ఇలా ఎన్నో రకాలుగా ప్రజల ముక్కుపిండి వసూలు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకొనే ప్రణాళికతో మన ముందుకు వస్తున్నారని కాబట్టి ఎస్‌డిపీఐ పార్టీ ఆధ్వర్యంలో నమ్మకం దేనికి భవిష్యత్తు ఎవరికి అనే నినాదంతో ఈప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల ముందుకు, ఓటర్ల ముందుకు తీసుకుని వెళ్లాలనే సంకల్పంతో కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.ఎస్‌డీపీఐ పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కలాం, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, జిల్లా కార్యవర్గ సభ్యులు సుల్తాన్, అసెంబ్లీ కార్యవర్గ సభ్యులు, మజీద్‌ఖాన్, పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌డిపీఐ అధ్యక్షులు హనీఫ్

## ఘనంగా సామూహిక కేదారేశ్వర వ్రతం వేడుకలు

**కాళికామాత ఆలయం నూతన మహిళ కమిటీ ప్రమాణస్వీకారం**

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :**

ఆళ్లగడ్డ పట్టణంలోని విశ్వరూప పారిశ్రామిక నగర్ లో వెలసిన శ్రీ శ్రీ శ్రీ కాళికామాత ఆలయం వద్ద సోమవారం కార్తీక మాసం సందర్భంగా సామూహిక కేదారేశ్వర వ్రతంవేడుకలు నోములను బ్రహ్మంగారిమఠం ఆస్థాన సిద్ధాంతి పోలేపల్లి రామబ్రహ్మం సిద్ధాంతి, ఆలయ ప్రధాన అర్చకులు విల్లనూరు చంద్రశేఖర ఆచారి లు సాంప్రదాయం ప్రకారం వేదమంత్రాల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక వన సమారాధన ఆలయ కమిటీ వారు పెద్ద ఎత్తున నిర్వహించారు. అనంతరం కాళికామాత ఆలయ నూతన మహిళా కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శిల్పి దురుగడ్డ రవీంద్రాచారి ఆధ్వర్యంలో మొత్తం 20 మంది మహిళా సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.నూతనఅధ్యక్షురాలుగాదురుగడ్డ అనురాధ, ఉపాధ్యక్షురాలుగా దురుగడ్డ సావిత్రమ్మ, బాణాల గోవిందమ్మ, ప్రధాన కార్యదర్శిగా విశాలాక్షి, కార్యదర్శులుగా పద్మావతి, జ్యోతి, వీరభద్రమ్మ, వెన్నెలశ్రీ ,కమిటీ సభ్యులుగా ఉమాదేవి. విజయ, జ్యోతి, గాయత్రి తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీంద్రాచారి, ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్ ఆచారి, రామాచా రి నూతన సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతన అధ్యక్షురాలుగా ఎంపికైన దురుగడ్డ అనురాధ మాట్లాడుతూ విశ్వరూప నగర్ లో వెలసిన శ్రీ కాళికామాత ఆలయ అభివృద్ధికి తాము శాయశక్తులా కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకంతో అమ్మవారికి సేవ చేసే అవకాశాన్ని కల్పించిన ఆలయ కమిటీ అధ్యక్షుడు శిల్పి రవీంద్రాచారి కి, కమిటీ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి అభివృద్ధి అధికారి కె ఆర్ యం మల్లిక్, ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ గంగన్న , విశ్వబ్రాహ్మణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నమ్మించి మోసం చేశారు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకి, బోయలను నమ్మించి మోసం చేశారని వాల్మీకి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని వాల్మీకి యువసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరులసమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని చెప్పి మోసం చేశారన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూడూరు శేష శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు సాయికుమార్, రామాంజనేయులు, రంగస్వామినాయుడు, బోయ ప్రశాంత్, శ్రీనివాసులునాయుడు, బోయ పాండు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఓటరు వెరిఫికేషన్

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఇంటింటికి వెళ్లి ఓటరు నమోదు కార్యక్రమాన్ని బీఎల్‌వోలు వెరిఫికేషన్ చేస్తున్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి పరిశీలిస్తున్నారు. ఓటు నమోదు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

# ముస్లింల సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వం..మాజీ మండలి చైర్మన్ షరీఫ్

**అధికారంలోకి వస్తే షాధిఖానాల అభివృద్ధికి ఏడాదికి రూ. కోటి ఖర్చు చేస్తామన్న భూమా అఖిలప్రియ**



భూమా అఖిలప్రియను సన్మానిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :**ముస్లింల సంక్షేమాన్ని వైకాపా ప్రభుత్వం మర్చిపోయిందని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఎస్ షరీఫ్ అన్నారు. సోమవారం స్థానిక రామలింగారెడ్డి కళ్యాణ మండపంలో తెదేపా ఆధ్వర్యంలో ముస్లింల ఆత్మీయ సమ్మేళనం మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనమండలి మాజీ చైర్మన్ ఎం ఎస్ షరీఫ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార వైకాపా ప్రభుత్వం ముస్లింల సంక్షేమాన్ని పక్కకు పెట్టిందన్నారు. ముస్లింల సంక్షేమా నికి వచ్చిన నిధులను నవరత్నాలకు ప్రభుత్వం ఖర్చు పెడుతోందని ఆయన ఆరోపించారు. కొత్తగా ఇల్లు కట్టుకున్నప్పుడు ఇంటికి దిష్టి బొమ్మ కడతామని అలాగా ఉపముఖ్యమంత్రి అంజాద్ భాష ముస్లింలను దిష్టిబొమ్మలుగా చేశారని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ శాఖకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కేవలం వైకాపా ఓటు బ్యాంకు గానే ముస్లింలను చూస్తోందన్నారు. తెదేపా అధికారంలోకి వస్తేనే మైనార్టీల సంక్షేమం అభివృద్ధికి పాటుపడడంజరుగుతుందని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఆయన ముస్లిం సోదరులకు పిలుపునిచ్చారు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ మాట్లాడుతూ తెదేపా అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి సంవత్సరం షాధిఖానాల అభివృద్ధికి మండలానికి ప్రతి ఏడాది రూ. కోటి రూపాయలు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. ఆళ్లగడ్డలో ఆడపిల్లలకు మగ పిల్లలకు వేరువేరుగా మదరసాలను ఏర్పాటు చేస్తామన్నారు. నేనుమంత్రిగాఉన్నసమయంలో ముస్లింమైనార్టీలసంక్షేమం అభివృద్ధి కోసం శ్రమించడం జరిగిందన్నారు. గతంలో ముఖ్యమంత్రులను మంత్రులు ఎమ్మెల్యేలు కలవడం నిధులు మందులు చేయించుకోవడం జరిగింది కానీ ఇప్పుడు ముఖ్యమంత్రిని ఎమ్మెల్యేలు కలవడమే ఇబ్బందిగా ఉంది అన్నారు. ప్రభుత్వంతో కొట్లాడిన బ్రతిమాలిన నిధులు తెప్పించుకునే నాయకులు ఉంటేనే ఆ నియోజకవర్గాలు అభివృద్ధి అవుతాయన్నారు. తెదేపా అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో మైనార్టీల అభివృద్ధి సంక్షేమం కోసం పాటుపడతామన్నారు. అనంతరం తాలూకాలోని ముస్లిం సోదరులు శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, అద్దంకి తాలూకా మైనార్టీ నాయకులు షమీన్ ఖాన్ లను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉసేన్ భాష, మాజీ జడ్పిటిసి చాంద్బాషా, కాంట్రాక్టర్ నన్నే బై గారి జిలాని, మాజీ సర్పంచ్ అన్సర్ భాషా , సిరివెళ్ల మాజీ సర్పంచ్ ఖాజా హుస్సేన్, నియోజకవర్గంలోని ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు సామాజిక సంక్షేమాభివృద్ధి దిశగా ఎదగాలి

**మల్లెల గ్రూపు అధినేత ఆల్ఫ్రెడ్ రాజు**



సన్మానిస్తున్న దృశ్యం

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** వికలాంగులు అన్ని రంగాల్లో సామాజిక సంక్షేమ అభివృద్ధి సాధించాలని ఆ దిశగా ప్రభుత్వాలు వీరికి చేయూతని అందించాలని మల్లెల గ్రూపు అధినేత ఆల్ఫ్రెడ్ రాజు పేర్కొన్నారు. సిక్రెడ్ సంస్థ సిఒడి. రామాంజనేయులు, ఆర్థోటెక్నిక్ ఆదిశేషయ్య, జిల్లా విహెచ్ పిఎస్ అధ్యక్షుడు నాగరాజు, తాలూకా అధ్యక్షులు రామాంజనేయులు ఆధ్వర్యంలో 64వ ప్రపంచ వికలాంగుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.వారు మాట్లాడుతూ వికలాంగుల్లో ఎంతో ప్రతిభ దాగుందని నేడు సమాజంలో ఎన్నో ఉన్నతమైన పదవులు వికలాంగులు అలంకరిస్తున్నారంటే వారిలో దాగి ఉన్న ప్రతివే దీనికి కారణమని పేర్కొన్నారు. వికలాంగులకు కేవలం ప్రభుత్వం 3 వేలు పెన్షన్ తో మాత్రమే సరిపెట్టి మిగతా సామాజిక సంక్షేమ ఫలాలను అందించడం లేదన్నారు. 2016 వికలాంగుల హక్కుల చట్టాన్ని, 4 శాతం రిజర్వేషన్ ను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. అలాగే ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఆదోని డివిజన్ నుంచి కర్నూల్ కలెక్టరేట్ వరకు చేపట్టబోయే వికలాంగుల హక్కుల పోరుబాట యాత్రకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప, లింగన్న గౌడ్, బి సి సోమన్న, నాగశేషమ్మ, ఎంపిటిసి విజయ్ లక్ష్మి, తాలూకా ప్రధాన కార్యదర్శి పెద్దయ్య, ఎమ్మిగనూరు విహెచ్ పిఎస్ మండల అధ్యక్షులు బి శ్రీనివాసులు, టౌన్ అధ్యక్షుడు బి రఘువీరా, పాల్గొన్నారు.

# తెదేపాతోనే మన భవిష్యత్తుకు గ్యారెంటీ



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో యువతకు భవిష్యత్తుకు ఉండాలంటే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతోని సాధ్యమవుతుందని తాలూకా టిడిపి యువ నాయకులు భూమా జగత్ విక్యాత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆళ్లగడ్డ మున్సిపాలిటీలోని రామలక్ష్మి కొట్టాలలో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని యువత భవిష్యత్తు బంగారు బాటలో ఉండాలంటే తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టాలని ఆయన యువతను కోరారు.తెదేపా అధికారంలోకి వస్తే ప్రజాసంక్షేమం ,అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని అన్నారు. నవరత్నాల కంటే మంచి సంక్షేమ పథకాలను భవిష్యత్తుకు గ్యారెంటీ ద్వారా తెలుగుదేశం పార్టీ ప్రజలకు అందిస్తుం దన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెదేపా జనసేన ఉమ్మడి ప్రభుత్వాని కి అధికారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. కౌన్సిలర్ హుస్సేన్ భాష తెదేపానాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తుమ్మలపెంటలో బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రజా వేదిక

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్‌:** రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఇచ్చే నాయకుడు చంద్రబాబు నాయుడు అయితే జగన్ మాత్రం రాష్ట్ర ఆస్తులను దోచుకోవడానికి గ్యారంటీ ఇస్తున్నారు అని బీసీ జనార్ధన్ రెడ్డి ఆరోపించారు. సోమవారం తుమ్మలపెంటలో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో బీసీ జనార్ధన్ రెడ్డి పాల్గొని ఇంటింటికి తిరిగి వైసీపీ వైఫల్యాలను గుర్తు చేస్తూ అవగాహన కల్పించారు. అమ్మవొడి ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి ఇస్తా అని ప్రగల్బాలు పలికి ఒక్కరికే ఇస్తూ అందులోను రూ. 2000 కత్తెర వేసి 13000వేలు ఇస్తున్నాడు అంతేకాకుండా అనేక నిబంధనలు పెట్టి చాలా మందికి అమ్మవొడి రాకుండా చేసిన సైకో జగన్ రెడ్డి అని మండిపడ్డారు. తెలుగుదేశం ప్రబుత్వం వస్తే తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటూ ఉంటే అంత మందికి ఎటువంటి వివక్ష లేకుండా ఏడాదికి 15000వేలు తెలుగుదేశం ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. మాట తప్పం, మడమ తిప్పం అంటూ గొప్పలు చెప్పుకున్న జగన్ రెడ్డి ఇప్పుడు అమ్మవొడి, మద్య నిషేదం, 45ఏళ్లకే ఫించన్ వంటి హామీలపై ఇచ్చిన మాటలు అన్నింటిని తప్పి ప్రజలను మోసం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్ర బాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల జీవితాల్లో మార్పు రావడం తథ్యమని తెలిపారు. ఈ సందర్భంగా 6 భవిష్యత్తు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు బీసీ జనార్ధన్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, బీసీ అభిమానులు పాల్గొన్నారు.



ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న బీసీ జనార్ధన్ రెడ్డి

# సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలు చేపట్టాలి



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** నగర పరిదిలోని మురారినగర్, కృష్ణారెడ్డినగర్, బంగారుపేట వంటి తదితర కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు లేవని వాటిని నిర్మాణాన్ని చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని ఆయా కాలనీల వాసులు కోరినట్లు కమిషనర్ భార్గవతేజ వెల్లడించారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లక్ష్మీపురంలోని మయూరి గ్రీన్‌ల్యాండ్స్, పెద్దపాడు శ్రీరామ రెసిడెన్సీలలో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రోడ్డు రిపేరు చేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు చేపట్టాలని, త్వరగా ఆ పనులు చేపట్టాలని ఆయా కాలనీ వాసులు కోరినట్లు తెలిపారు. అశోక్‌నగర్ కాలనీలో మురుగునీటి కాలువ చిన్నగా ఉండటం వల్ల కొద్దిపాటి వర్షం కురిస్తే డ్రైనేజీ కాలువలు పొంగి రోడ్డుపైకి మురికినీరు వస్తుందని కాలువలను పెద్దవి చేసి డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని ఆయన తెలిపారు. స్పందనలో వచ్చిన సమస్యల పట్ల సంబంధితాధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పరిష్కరించి ప్రజలు ఇబ్బందులు చూడాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ వేణుగోపాల్, డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, డీఈ రవిప్రకాష్‌నాయుడు, మేనేజర్ చిన్నరాముడు, ఎంహెచ్‌వో విశ్వేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాలో నమోదుకు డాక్యుమెంట్లు తప్పనిసరి

**– బిఎల్‌ఓలను ఆదేశించిన కలెక్టర్**
**– రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా ముగించాలి**



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి డాక్యుమెంట్లను ఫైల్ చేసుకున్న తరువాతనే ఓటర్ల జాబితాలో పొందుపరచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ బిఎల్‌ఓలను ఆదేశించారు. సోమవారం నంద్యాల పట్టణంలోని నంద్యాల తహశీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించి ఓటర్ల జాబితాలో కొత్తగా నమోదుకు ఫారం–6, తొలగింపులకు 7, మార్పులు చేర్పులకు 8 సంబంధిత డాక్యుమెంట్లను ఫైల్ చేసుకున్న పిదప జాబితాలో పొందుపరచాలని ఆదేశించారు. డెత్ ఓటర్లకు సంబంధించి ధృవపత్రాలు సమర్పించని పక్షంలో పంచనామా నిర్వహించి సంబంధిత పత్రాలు ఫైల్ చేసుకుని తొలగించాలన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బూత్‌స్థాయి అధికారులు తప్పనిసరిగా బిఎల్‌ఓల రిజిష్టర్లు నిర్వహిస్తూ ప్రొసీజర్ ప్రకారం ఫాలో కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ తనిఖీ సమయంలో ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లినట్లు నిర్ధారణ అయితే సంబంధిత బిఎల్‌ఓలపై చర్యలు తప్పవన్నారు. అనంతరం సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని సందర్శిస్తూ కార్యాలయంలో జనం గుమికూడకుండా ఎప్పటికప్పుడు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పనులు ముగించి పంపించాలన్నారు కార్యాలయంలో ఏవైనా పరికరాలు ఇతర సదుపాయాల లోపాలు ఉంటే పై అధికారుల నుంచి తెప్పించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వీలైనంత త్వరలో ప్రజల పనులను పూర్తి చేసి పంపించాలని కలెక్టర్ సూచించారు.

# అక్రమంగా నిర్మించిన చర్చి కూల్చివేత

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** నగర శివారులోని పెద్దపాడు డ్రైవర్స్‌కాలనీలో అక్రమంగా ప్రభుత్వ స్థలంలో నిర్మించిన చర్చిని సోమవారం కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. గత కొన్ని సంవత్సరాలుగా అక్కడున్న కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చర్చిలు కడుతూనే ఉన్నారు. ఇప్పటికీ రెండుసార్లు కూల్చినా గతనెల భారీ స్థాయిలో చర్చిని నిర్మించడంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వం ఆదేశాలతో కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, 4వ పట్టణ సీఐ శంకరయ్య తమ సిబ్బందితో అక్కడకు వెళ్లి విచారించి జేసీబీతో చర్చిని పూర్తిగా తొలగించారు. డీఎస్పీ విజయశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో చర్చిలు, ప్రార్థన మందిరాలు నిర్మిస్తే చర్యలు తప్పువన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

# స్పందన వినతులను సత్వరమే పరిష్కరించండి



వినతులను స్వీకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** జగనన్నకు చెబుదాం..స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన వినతులపై తక్షణమే స్పందించి నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకట శివ, కామేశ్వరరావులు సూచించారు. సోమవారం స్పందనలో వారు మాట్లాడుతూ స్పందన వినతులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ఫిర్యాదులపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయి దృష్టి సారించి నిర్ణీతకాల వ్యవధిలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 180మంది అర్జీదారులు తమ సమస్యలు పరిష్కారానికి అర్జీలు సమర్పించారన్నారు. ఈసమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ అధికారులకు జారీ చేశారు.

# డిగ్రీ సెకెండ్, ఫోర్త్ సెమిస్టర్ల ఫలితాల్లో రావూస్ జయభేరి




**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** రాయలసీమ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ సెకండ్ , ఫోర్త్ సెమిస్టర్ల ఫలితాలలో పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జయభేరి మోగించారు. టౌన్ టాపర్లుగా రావూస్ విద్యార్థులు ప్రతిభ చాటారు. బిఎస్సీలోని బిజెడ్సి నాలుగవ సెమిస్టర్లో షేక్.అరిఫాబాన్ 9.8,బి. సంధ్యరాణి 9.2, ఎంపీసియస్‌లో కె.వీణ 9.2, ఎన్. రుక్సానాబాను 9.1, ఎమ్మెస్సీ ఎస్‌లో ఎస్. తబుసుమ్ 9.4,ఎం. సౌమ్య 9.4,సెకండ్ సెమిస్టర్ ఎమ్మెస్సీఎస్ లో కె. దివ్య శ్రావణి 9.1, కె. శ్రేయ 9.0, ఎంపీసీఎస్ లో ఫై రోజా 9.4 జీపిఏ లతో టౌన్ టాపర్ గా నిలిచారు. నాలుగవ సెమిస్టర్ లో బికాంలో తహసన్ 8.37, జీనత్ బేగం 8.32, బిబిఏలో కె.మహేష్ 8.26, కె, ఎన్ అహ్మద్ 8.13 బిఏ లో సి. రాఘవేంద్ర 7.81,జి. ఝాన్సీ7.7 సెకండ్ సెమిస్టర్ లో ఎంపీసీఎస్ లో ఫైమునిస 8.61,బికాం లో కె.సహీదా 8.1, తేజ 7.8,బి జెడ్సి లో ఎస్. తస్లీమా 8.7, వి. అనిత 8.5,బిబిఏ లో బి. మేఘన 7.6 బిఏ లో చంద్రిక 7.9 మార్కులు జీ పిఏ లతో గ్రూప్ టాపర్లుగా నిలిచారు.సెకండ్‌సెమిస్టర్ల ఫలితాలలో ఎంఎస్సీఎస్ లో 85 శాతం, ఎంపీసీఎస్ లో 95 శాతం, బీజెడ్సీలో 60 శాతం, బికాంలో 75 శాతం, బిఏలో 85 శాతం, బిబిఏలో 55 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఫోర్త్ సెమిస్టర్ లో ఎంఎస్సీఎస్ లో 90శాతం, ఎంపీసీఎస్‌లో64శాతం, బీజెడ్సీలో 60శాతం, బికాంలో 62 శాతం, బిఏలో 61 శాతం, బిబిఏలో 70శాతం ఉత్తీర్ణత సాధించారు. డిగ్రీ సెకండ్ ,ఫోర్త్‌సెమిస్టర్ల ఫలితాలలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు కళాశాల సీఈఓ తిరుమలరెడ్డి, సీవోవో సుజనారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రకాష్,వైస్‌ప్రిన్సిపల్‌ఇర్ఫాన్,నోడల్ ఆఫీసర్ రాఘవేంద్ర,అధ్యాపకులు వెంకటేష్ , నూర్ బాషా, పవిత్ర,నందిని, జయలక్ష్మి, అన్నపూర్ణ, మాధురి, విజయ్ కుమార్ ,నరసింహులు, మనోవెంకట్, రామకృష్ణ, విజయరాజు, గోరంట్ల, పాల్ రాజ్, వీరేష్ , మనోహర్, ధనుంజయ, గోవిందు, ప్రత్యేకంగా అభినందించారు.

# 9న నియోజకవర్గ స్థాయి మైనార్టీల ఆత్మీయ సమావేశం

**కరపత్రాలను విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే బీవీ**


కరపత్రాలను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ఈనెల 9వతేదీ(శనివారం)ఎమ్మిగనూరు నియోజకవర్గస్థాయి మైనార్టీల ఆత్మీయ సమావేశం జరుగుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మైనార్టీ నాయకులతో జరుగు సమావేశానికి సంబంధించిన విధి విధానాల గురించి చర్చించారు. ఈ మేరకు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియో జకవర్గంలో జరిగే మైనార్టీల సమావేశానికి పెద్ద ఎత్తునహాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి వార్డు పరిధిలోని మైనార్టీలందరూ హాజరయ్యే విధంగా టిడిపి మైనారిటీ నాయకులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జరుగు సమావేశానికి రాష్ట్ర టీడీపీ మైనార్టీ నాయకులు పాల్గొంటున్నట్లు తెలిపారు.టీడీపీ మైనార్టీ నాయకులు హుసేన్ సాహెబ్, తురేగల్ నజీర్ అహమ్మద్, ఖాసీం వలి,గుల్లా సలాం, కల్లీము ల్లా, సోమల గూడూరు బాషా, నాగూర్ బాషా, మున్నా, గౌస్, సలీమ్, ఖాజా, షర్ఫుద్దీన్, అబ్దుల్లా, మోషిన్, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధి కావాలంటే.. జగనే ఏపికి సిఎం కావాలి


వైయస్ఆర్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, వైకాపా నాయకులు

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌:** రాష్ట్రంలోని ప్రజలకు సంక్షేమం, రాష్ట్రం అభివృద్ది చెందాలంటే మరోసారి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కావాలనిపత్తికొండనియోజకవర్గంఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ అన్నారు. మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమానికి పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మను గ్రామానికి చెందిన మహిళలు గజమాలతో సత్కరించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ మాట్లాడుతూ నేడు మన రాష్ట్రం దేశంలోనే అభివృద్దిలో ప్రధమ స్థానంలో నిలిచిందని, రాష్ట్రంలోని ప్రజల కష్టనష్టాలను నేరుగా చూసి, వారికి ఏమి కావాలో తెలుసుకొని, నేడు ఇచ్చిన హామీలను గడిచిన నాలుగున్నర సంవత్సర కాలంలో 99శాతం పూర్తి చేసిన ఘనత సిఎం జగనే దక్కుతుందన్నారు. కావున రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికలలో మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం పాడి రైతుల పశువులకు వర్తించే వైయస్ఆర్ పశుభీమా పథకం, పాడి పశువులు మరణిస్తే నష్టపోయిన పశుపోషకులకు భీమా చెల్లింపు కార్డులను ఎమ్మెల్యే అందజేశారు. అదేవిధంగా గ్రామ వైకాపా నాయకురాలు కంగాటి వాసంతమ్మ, వెల్దుర్తి సింగిల్ విండో అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి, సర్పంచ్ బోయ రాములమ్మ, వైస్ ఎంపిపి కురువ రాజేశ్వరిలతో కలిసి గ్రామంలో వైయస్ఆర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.వైయస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, చెరుకులపాడు గ్రామ ప్రజలు, వాలంటీర్లు, గృహసారధులు పాల్గొన్నారు.

# టీడీపీలో చేరిన ఆటో ట్రాలీ డ్రైవర్ మరియు వర్కర్స్ యూనియన్ సభ్యులు


గజమాలతో సత్కరిస్తున్న యూనియన్ సభ్యులు

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** బనగానపల్లె పట్టణానికి చెందిన ఆటో ట్రాలీ డ్రైవర్స్ మరియు వర్కర్స్ యూనియన్‌కు చెందిన 50 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్థన్ రెడ్డి, బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే బీసీ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో చేరిన ఆటో ట్రాలీ డ్రైవర్స్ మరియు యూనియన్ సభ్యులకు సముచిత స్థానం లభిస్తుందని వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు.

# బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి


అవగాహన కల్పిస్తున్న పిఆర్ ఎస్ఈ

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలు బడిలో ఉండేలా చూసుకోవాలని పంచాయితీరాజ్ ఎస్ఈ రామ్మోహన్ తెలియజేసారు. సోమవారం మండలంలోని వనిపెంట చెంచు గూడెం,చాగలమర్రి చెంచుకాలనీ,ఎస్‌టి కాలనీలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటింకి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డ్రాపవుట్స్ లేకుండా చూసేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామని తెలియజేసారు.కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా,ఏఈ కొండారెడ్డి,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్జీల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలి – సబ్ కలెక్టర్


అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

**ఆదోని, మేజర్‌న్యూస్ :** స్పందనలో వచ్చిన అర్జీల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయా మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్పందనలో ఆయా మండలాల నుంచి వచ్చిన అర్జీలను సబ్ కలెక్టర్‌కు అందజేశారు.

1. నాకు వివాహం జరిగి నాలుగు సంవత్సరాలు పూర్తయింది. కానీ మా అమ్మ రేషన్ కార్డులో ఉన్నాను. ప్రస్తుతం నాకు కొత్త బియ్యం కార్డు నాకు కుటుంబానికి మంజూరు చేయాలని ఆదోని పట్టణం 6వ వార్డుకు చెందిన వీరాంజనేయులు సబ్ కలెక్టర్‌ను కోరారు.
2. హొళగుంద మండలం గజ్జెహల్లి గ్రామానికి చెందిన సుహసినికి సంబంధించి సర్వే నెం. 134/ఏలో 2.37 ఎకరాల భూమి పెద్దల పేదల నుండి సంక్రమించింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు నమోదైంది. దళిత విచారణ చేసిన పేరు నమోదు చేయాలని అర్జీ సమర్పించుకున్నారు.

ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి గోవింద్ సింగ్, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, డిఎల్‌డిఓ నాగేశ్వరరావు, డిఎల్‌పిఓ శ్రీనివాసులు, ఆర్టీసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ లక్ష్మి నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ చైతన్య ప్రియ, ఉప తహశీల్దార్ వలిబాష, కౌసరు బాను, వలిబాష, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే రానున్న ఎన్నికల్లో జగన్‌ను సాగనంపుతారు

**– టీడీపీ కర్నూలు పార్లమెంటు అధ్యక్షుడు బీటీనాయుడు**

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** విద్యార్థులే రానున్న ఎన్నికల్లో జగన్‌ను సాగనంపుతారని టీడీపీ కర్నూలు పార్లమెంటు అధ్యక్షుడు బీటీనాయుడు అన్నారు. తెలుగునాడు విద్యార్థి సమాఖ్య కర్నూలు జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన ఓ విద్యార్థి మేలుకో భవిష్యత్తు కాపాడుకో కార్యక్రమంలో బీటీనాయుడు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ నాయకులు నాగేశ్వరరావుయాదవ్, రామపుల్లయ్యయాదవ్, నరసింహులు యాదవ్, నరసింహులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదికో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని హామీ ఇచ్చిన జగన్ నాలుగేళ్లు కావస్తున్నా ఇంతవరకు ఒక్క ప్రభుత్వానికి కూడా నోటిఫికేషన్ జారీ చేయకపోవడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో యువత వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీ నాయకులు మహేష్‌గౌడ్, నాగరాజుయాదవ్, కిషోర్‌కుమార్, షేక్షావలి, కుంపటి కృష్ణ, షేక్షావలి, రామచంద్రనాయుడు, హేమంత్, పవన్‌కళ్యాణ్, సురేంద్ర, కిరణ్ పాల్గొన్నారు.



# సిద్ధేశ్వరస్వామి దేవాలయంలో ఘనంగా కార్తీక దీపోత్సవ కార్యక్రమం





**హొళగుంద,మేజర్‌న్యూస్ :** హొళగుందలోని కొండ గుహల్లో వెలసిన శ్రీ సిద్దేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసంలో భాగంగా సోమవారం దీపోత్సవ కార్యాక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు.స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు చేసి సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై దీపోత్సవ కార్యాక్రమాన్ని విశేషంగా నిర్వహించారు.ముందుగా హాలహర్వి మండలం జంగమర హోసల్లి మఠంకు చెందిన ఆజాత శంభులింగ శివచార్యుల ద్వారా దీపోత్సవ కార్యాక్రాన్ని ప్రారంభించారు.దేవాలయ ప్రాంగణంలో శ్రీ సిద్దేశ్వరస్వామి పేరుతో,శివుని,ఓం,దీపం ఓం నమః శివాయ ఆకృతిలతో ఏర్పాటు చేసిన దీపాలను భక్తులు వెలగించారు.దీపాల కాంతులతో దేవాలయ ప్రాంగణం శోభిల్లింది.ఆదేవిధంగా శ్రీరామ్‌నగర్ క్యాంఫ్‌లో ఉన్న దేవాలయంలో కూడా భక్తులు కార్తీక దీపోత్సావాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యాక్రమాన్ని వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

సూర్య



## నైపుణ్య శిక్షణతోనే ఉన్నత ఉద్యోగావకాశాలు

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్:** నైపుణ్య శిక్షణతోనే ఉన్నత ఉద్యోగ అవకాశాలు వస్తాయని నైస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర రాయపాటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నగరంలోని నైస్ కంప్యూటర్స్ శిక్షణ కార్యాలయంలో కంప్యూటర్ ఆఫీస్ మెయింటెనెన్స్, ట్యాలీ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ట్యాలీ తప్పక నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీఆర్ కళాశాల జూనియర్ అధ్యాపకులు నవీన్‌కుమార్, రాయపాటి నాగలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సుబ్బయ్యతాతకు ప్రత్యేక పూజలు

### తరలివచ్చిన భక్తజనం


సుబ్బయ్యతాత స్వామి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆనంద్ కుటుంబం

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ :** పట్టణ సమీపంలోని ఆరుమాను దిక్కు పొలాలలో వెలసిన శ్రీశ్రీశ్రీ సుబ్బయ్య తాత ఆలయంలో సోమవారం కార్తీకమాసాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన కుమ్మరి ఆనందు, గౌరీ, బాలు, రంగస్వామి స్వామి విగ్రహాన్ని పూలతో సుందరంగా అలంకరించి పూజలు గావించారు. అనంతరం స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు కుటుంబ సభ్యులు కార్తీకమాసం సందర్భంగా భోజనాలు ఏర్పాటు చేశారు. అంతకు ముందు కార్తీకదీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.

## భక్తి శ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజా


అయ్యప్పస్వామి పడిపూజాను చేస్తున్న భక్తులు

**హొళగుంద, మేజర్‌న్యూస్ :** హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామంలో సోమవారం అయ్యప్పస్వామి పడిపూజా కార్యాక్రమం అయ్యప్ప భక్తులు భక్తిశ్రద్ధలతో చేశారు. కఠోర దీక్షలో ఉన్న అయ్యప్పస్వామి భక్తులు వినాయక, అయ్యప్పస్వామి, సుబ్రమణ్యం స్వామిల చిత్రపటానికి ప్రత్యేకంగా పూజాలు చేసి అయ్యప్పస్వామి నామస్మరణంతో భజనాలు చేసి ఘనంగా పూజాలు చేశారు. మణికంఠ, అయ్యప్పస్వామి భక్తులు భక్తిభావంతో ఘనంగా పూజాలు చేసి భక్తులకు ప్రసాదాలు అందించారు. కార్యాక్రమంలో భక్తులు,ప్రజలు హజరైయ్యారు.

## సాయుధ దళాల కుటుంబాల సంక్షేమానికి సహకరించాలి

### – జేసీ నారపురెడ్డి మౌర్య


స్టిక్కర్స్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** దేశ రక్షణఖు నిరంతర సేవలు అందిస్తూ యుద్ధంలో మరణించిన, పదవి విరమణ చేసిన సాయుధ దళాల కుటుంబాల సంక్షేమానికి తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని జేసీ నారపురెడ్డి మౌర్యపిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో త్రిసాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా సాయుధ దళాల పతాక స్టిక్కర్, కార్ గ్లాగ్స్‌ను జేసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్రిసాయుధ దళాల సేవలు కీలకమని, దేశ సేవలో వీరజవానుల సేవలు మరువలేనివన్నారు. సాయుధ దళాల కుటుంబాలను ఆదుకునేందుకు సిబ్బంది విరాళాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి రత్నరూత్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## భూ కబ్జాదారుల నుంచి మమ్మల్ని కాపాడండి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి:** భూ కబ్జాదారుల నుంచి మమ్మల్ని కాపాడాలని బీజేపీ కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ కో–కన్వీనర్ వేల్పుల గోపాల్ కోరారు. గూడూరు మండలం బూడిదపాడు గ్రామానికి చెందిన కొందరు పేద రైతులు దాదాపు 300ఏళ్లు సాగు చేసుకుంటున్న భూములను గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు తమ భూములను కబ్జా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకొని పేద రైతుల భూములను రైతులకు అందించాలన్నారు. లేని పక్షంలో ధర్నాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీజిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర, యువమోర్చ జిల్లా అధ్యక్షుడు కేశవరామ్ చౌదరి, కిసాన్ యువమోర్చా నాయకులు భాస్కర్, రాంభూపాల్, గ్రామ రైతులు బుగ్గన్న, రాముడు పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీ టీమ్‌కు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌జిఎస్ పిడి

**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజీక తనిఖీ సభ్యులకు సహకరించాలని ఎన్‌ఆర్‌జిఎస్ పిడి లోకేష్ పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఓ కార్యాలయంలో సామాజీక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ, గ్రామాలకు వచ్చినప్పుడు పనులను, రికార్డులను సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజీక తనికీ సిబ్బంది ఏపిఓ తిమ్మారెడ్డి, పిఆర్‌డిఈ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి చంద్రబాబే

### జిల్లా బీసీసెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జున


మహిళకు పథకాల గురించి వివరిస్తున్న మహిళా టిడిపి నాయకురాలు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ, రాష్ట్రం విడిపోయిన తరువాత ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ అప్పటికి, ఇప్పటికీ, ఎప్పటికీ మహిళా అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తం ఒక్క నారా చంద్రబాబునాయుడేనని జిల్లా టిడిపి బీసిసెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జన అన్నారు. బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా డోన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మారం మన్నె సుబ్బారెడ్డి ఆదేశానుసారం సోమవారం పట్టణంలోని ఇందిరానగర్‌లోని 100, 104 బూత్‌లలో టిడిపి పట్టణ అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు ప్రకటించిన పథకాల గురించి మహిళలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళల ఎదుగుదలకు కృషి చేసింది నారా చంద్రబాబేనని, రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే వారికి ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు, దీపం పథకం ద్వారా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేయడం, ఆడబిడ్డ పథకం కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి స్త్రీకి రూ.1500లు మరియు మహిళలకు జిల్లా వరకు ఉచిత బస్సు ప్రయాణం అని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి తెలుగుయువత కమిటీ నాయకులు ఎర్రిస్వామిగౌడ్, పట్టణ బీసి సెల్ ఉపాధ్యక్షులు ధను, మదనగోపాల్‌రెడ్డి, మధు, సురేష్, బోయ సురేంద్ర, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల ర్యాలీ



ధర్నా చేస్తున్న న్యాయవాదులు

**కర్నూలు లీగల్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకవచ్చిన గృహక్కుల చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం కర్నూలులో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ప్రజల ఆస్తులకు భద్రత లేని ఏపీ భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. జిల్లా కోర్టు నుంచి మునిసిఫ్ కోర్టు మీదుగా పాతబస్టాండు అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణ్‌ణాయుడు, చక్రపాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకవచ్చిన భూ హక్కు చట్టం లోభూయిష్టంగా ఉందన్నారు. దీని వల్ల ప్రజల ఆస్తులకు భద్రత కరువు అవుతుందన్నారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేయాలనిరరారు. లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చంద్రుడు, లక్ష్మన్న, మోహన్‌రెడ్డి, నాగముని, జహంగీర్‌బాష, వెంకటేశ్వర్లు, యార్లపాడు సుంకన్న, రవి, చౌదరి పాల్గొన్నారు.

### సినీసంగీత రంగంలో

## ఘంటసాల విశేష కృషి

**ఆదోనిరూరల్, మేజర్‌న్యూస్ :** సినీ సంగీత రంగంలో విశేష కృషి సల్పిన ఘంటసాల అని బీసీ సంఘం నాయకులు నీలకంఠప్ప, ఎం.డి బసవరాజ్‌స్వామి, ఆంజనేయులు, మల్లేశ్వరరావులు పేర్కొన్నారు. సోమవారం ఘంటసాల స్వప్త స్వరాల కళాసమితి ఆధ్వర్యంలో ఘంటసాల 101 జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, డిసెంబర్ 4వ తేదిన 1922న చౌటుపల్లి గ్రామంలో జన్మనిచ్చారు. ఘంటసాల అనేక కష్టాలను అనుభవించి సొంత కృషితో సంగీత సాధన చేసి తన స్వరాన పలికించి ప్రేక్షకులను రంజింప చేశారు. మధుర గీతాల గాన గంధర్వంతో 1974 ఫిబ్రవరి 11వ తేదిన స్వర్గస్థులయ్యారు. వారి సంగీత స్వరాలు నేటికి అందరిని అలరిస్తున్నాయి. వారి సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గురుదేవ్ స్వామి, మాల మహానాడు నాయకులు గుడేకల్లు కుమార్‌స్వామి,రామన్నయాదవ్, మద్దిలేటి, నాగేష్, హనుమంతు ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.


ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు



పల్లెకు పోదాం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ చల్లా

### ప్రజా సంక్షేమం కోసమే

## పల్లెకు పోదాం కార్యక్రమాలు

### – చల్లా రాజశేఖర్‌రెడ్డి

**అవుకు, మేజర్‌న్యూస్ :** ప్రజా సంక్షేమం కోసమే పల్లెకు పోదాం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని మండల అధ్యక్షుడు చల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండమనాయునిపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల పరిషత్ నిధులతో ఆ గ్రామంలో మరియు మజరా గ్రామాల్లో చేసిన పనులను ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రజలకు ఆయా గ్రామాల్లో ఏఏ పనులు ఎన్ని నిధులతో జరిగాయో అధికారులు తెల్పుతారని అంతేకాకుండా ప్రజలకు ఏమైనా అవసరాలు ఉంటే కూడా వాటిని ఈ కార్యక్రమాల్లో గుర్తించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవొ జి. వెంకటేశ్వర రెడ్డి, తదితర అధికారులు ఎంపీటీసీ సభ్యుడు గ్రామ పెద్దలు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 7న ఛలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి : ఏఐటియుసి


డిఎంహెచ్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటియుసి నాయకులు

**డోన్, మేజర్‌న్యూస్ :** ఆశవర్కర్ల సమస్యలపై ఏఐటియుసి ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదిన తలపెట్టిన ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని ఆశావర్కర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సి.సుంకయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్, రూ.10లక్షల ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని, పిఎఫ్‌ఈఎస్‌ఐ కల్పించాలని, గ్రూప్ ఇన్సురెన్స్‌లు వంటి పలు రకాల సమస్యలపై కలెక్టర్ కార్యాలయం దగ్గర జిల్లాలోని ఆశావర్కర్లలందరూ అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. అనంతరం డిఎంహెచ్‌ఓను కలిసి ఆశావర్కర్ల న్యాయమైన వినతులకై పోరాడేందుకు చేపడుతున్న ధర్నాకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రఘురాంమూర్తి, ఆర్గనైజ్ సెక్రటరీ డి.శివబాలకృష్ణ, ఉపాధ్యక్షులు అబ్బాస్, ఆశావర్కర్ యూనియన్ నాయకురాలు పివి.వేదావతి, పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

# రైతుల అభివృద్ధి కోసం బిసివై పార్టీ పోరాటం

## భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్రయాదవ్


టమోటా రైతులతో ముచ్చటిస్తున్న బిసివై పార్టీ అధినేత

- **టమోటా రైతుల సమస్యల కోసం పోరాటం**
- **వేదావతి ద్వారా ఆస్పరికి తాగు, సాగునీరందించాలి**

**ఆలూరు, ఆస్పరి, మేజర్‌న్యూస్..** రాష్ట్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని వారి అభివృద్దే ధ్యేయంగా రాష్ట్రంలో భారత చైతన్య యువజన పార్టీ అవిర్భావించిందని పార్టీ జాతీయ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ తెలిపారు.సోమవారం ఆలూరు నియోజకవర్గం ఆస్పరి లో జిల్లా సమన్వయ సారధి వరుణ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వారు టమోటా రైతులతో చర్చించారు. వారు మాట్లాడుతూ ఆస్పరి, పత్తికొండ తదితర ప్రాంతాల్లో టమోటా పంట అధికంగా పండిస్తున్నారని వీరికి ధరలు తగ్గినప్పుడు పంటను నిల్వ చేయడానికి శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తామని గతంలో ఉన్న ప్రభుత్వాలు హామీలు ఇచ్చి రైతులను మోసం చేశారని అన్నారు.టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటులో నాయకులు విఫలమయ్యారని అన్నారు. రైతుల కోసం వారికి మద్దతుగా పోరాటం చేస్తామన్నారు. ఆలూరు నియోజకవర్గంలో వలసలు ఎక్కువగా ఉన్నాయని వాటిని నిలువరించాలంటే ఆలూరును పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని అన్నారు.ఆస్పరి మండలానికి హంద్రీనీవా, వేదావతి ద్వారా సాగు,తాగు నీరు అందించాలని వారు డిమాండ్ చేశారు.అనంతరం టమోటా రైతులతో ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతుల కోసం పుట్టిన పార్టీ బీసీవై అని వచ్చే ఎన్నికల్లో మన ఓట్లు బిసివై పార్టీకి వేయాలని అప్పుడే మార్పు జరిగి రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అనంతరం హొలగుంద మండలం ఎల్లార్తి షేక్షావలి తాత స్వామి సుదర్శించు కున్నారు. కార్యక్రమంలో నాయకులు ఉసేనప్పయాదవ్, కౌలుట్లయ్య, మోహన్‌ప్రసాద్, నరేష్ యాదవ్, జెడి.రంగస్వామి, ఎల్లార్తి అర్జున్, పక్కీరప్ప, సూరన్న, బీజేపీ ఇంచార్జ్ వెంకట రాముడు, గిరి యాదవ్, గౌతమ్‌కృష్ణ యాదవ్, అక్బర్ యాదవ్, ఓబులేసు, శ్రీనివాసులు యాదవ్, మహానంది, కుర్రోజి, రఘు, వెంకటరమణ, ఎంపీటీసీ చిన్నా యాదవ్, చంద్ర, గోపాల్, వీరేశ్, గోవిందు, లక్ష్మన్న పాల్గొన్నారు.


ఆస్పరిలో బిసివై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్‌తో జిల్లా నాయకులు వరుణ్ యాదవ్


రామచంద్ర యాదవ్‌కు సమస్యలు విన్నవిస్తున్న రైతులు

# పాలకులు పట్టించుకోవడం లేదు

## అసౌకర్యాల నడుమ నల్లబల్లి గ్రామ ప్రజలు

## గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మించాలి

## టిడిపి పట్టణ జనరల్ సెక్రటరీ పూజారి శివకిషోర్


మాట్లాడుతున్న శివకిషోర్

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం అంటూ ప్రజలకు కళ్ళబొల్లి మాటలు చెప్పడం మానుకొని, ముందు గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్యాపిలి పట్టణ జనరల్ సెక్రటరీ పూజారి శివకిషోర్ అన్నారు. సోమవారం టిడిపి పట్టణ జనరల్ సెక్రటరీ పూజారి శివకిషోర్ మేజర్‌న్యూస్‌తో మాట్లాడుతూ మండల పరిధిలోని కలచట్ల మజరా గ్రామమైన నల్లబల్లి గ్రామంలో సరైన సిసి రోడ్లు, డ్రైనేజి కాల్వలు లేకపోవడంతో మురికినీరు నడిరోడ్డుపై నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. మాటలు కట్టబెట్టి ముందు గ్రామంలో నెలకొన్న అసౌకర్యాలను తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి మంగళవారం గ్రామంలో వెలసిన నల్లబల్లి సుంకులమ్మ అమ్మవారిని దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారని, కాని ఇక్కడ నెలకొన్న సమస్యలను, అసౌకర్యాలను చూసి భక్తులు, ప్రజలు ఒకింత నిరుత్సాహానికి గురౌతున్నారన్నారు. అలాగే ప్రధాన రహదారిని ఆనుకొని ఆలయం ఉందని, ఆలయం చుట్టు కూడా అపరిశుభ్రంగా మారిందన్నారు. కావున అధికార పార్టీ నాయకులు మాయమాటలు కట్టబెట్టి నల్లబల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# టెండర్ల పేరుతో కడుపుకొడుతున్నారు


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**కర్నూలు సిటీ, మేజర్‌న్యూస్:** మున్సిపల్ అధికారులు టెండర్ల పేరుతో చికెన్‌షాపుల యజమానుల కడుపు కొడుతున్నారని సీపీఐ నాగర కార్యదర్శి రామక్రిష్ణారెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని చికెన్‌షాపు యజమానులు సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ అధికారులు కొంతమంది కోసం చికెన్‌షాపుల వేస్టేజ్‌కు తీసుకెళ్లడానికి టెండర్ పిలవడం దారుణమన్నారు. వెంటనే దానిని నిలిపివేయాలని కోరారు. అనంతరం స్పందన కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చికెన్‌షాపు యజమానులు మల్లికార్జున, రాజు, రవి, వీరేష్, బాష, ఖాదర్, రఫి, సీపీఐ నాయకులు నాగరాజు, మహేష్, బీసన్న, సయ్యద్, మౌలాలి, హుసేని, బాబయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

# కర్నూలు-బళ్లారి రహదారిని విస్తరించాలి


మాట్లాడుతున్న రసూల్

**కోడుమూరు, మేజర్‌న్యూస్:** కర్నూలు నుంచి బళ్లారి వరకు గల రహదారిని విస్తరించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రసూల్ న్నారు. సోమవారం ఏఐటీయూసీ కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రసూల్ మాట్లాడుతూ రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించాలన్నారు. కర్నూలు నుంచి నంద్యాల వరకు, కర్నూలు నుంచి బెంగుళూరు వరకు, కర్నూలు నుంచి హైదరాబాద్ వరకు, కర్నూలు టు ఆత్మకూరు వరకు నాలుగులైన్ల రహదారి నిర్మాణం జరిగిందన్నారు. కర్నూలు జిల్లాకు పశ్చిమ ప్రాంతాన ఉన్న బళ్లారి వరకు నాలుగులైన్ల చేపడితే జిల్లా పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి రాజు, పట్టణ కార్యదర్శి రాముడు, హమాలీ సంఘం ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# మరోసారి సీఎంగా జగనన్నను ఎన్నుకుందాం


మాట్లాడుతున్న లోకనాథ్‌రెడ్డి

**తుగ్గలి, మేజర్ న్యూస్:** రాష్ట్రంలోని ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మరోసారి సీఎంగా జగనన్నను ఎన్నుకుందామని సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఎర్ర నాగప్ప, విద్యాకమిటీ చైర్మన్ గుంతా రఘులు అన్నారు. సోమవారం జొన్నగిరి గ్రామంలో వైకాపా మండల కన్వీనర్ జిట్టా నాగేష్‌యాదవ్, సచివాలయ మండల కన్వీనర్‌హనుమంతు అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో కేవలం టీడీపీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, అయితే జగనన్న ప్రభుత్వంలో అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్మరాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తుగ్గలి మోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, లంకాయపల్లి హనుమంతరెడ్డి, రాంపురం గంగాధర్, గోవిందరాజులు, రామాంజనేయులు యాదవ్, జొన్నగిరి పక్కీరప్ప, రాంపురం సయ్యద్‌హుసేన్‌బాష, తెరప్ప పాల్గొన్నారు.

# పేదవాడి సొంతింటి కల నేరవేర్చిన సీఎం

## - వైసీపీ యువనేత


సొంతింటిని ప్రారంభిస్తున్న వైసీపీ యువనేత

**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** పేదవాడి సొంతింటి కల నేరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని వైకాపా నేత ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు చట్నేహళ్ళి గ్రామంలో శారదమ్మ, లక్ష్మన్న దంపతులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నూతనంగా నిర్మించిన ఇంటి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. అనంతరం ప్రదీప్‌రెడ్డికి బీరప్ప దేవాలయం వద్ద నుండి ఊరేగింపు నిర్వహిస్తూ, పూలవర్షం కురిపించి గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఆంజిని, ఉప సర్పంచు వీర నాగప్ప, ఎంపిటీసీ సభ్యుడు రామాంజనేయులు, నాయకులు ఆలింగప్ప, తిక్కస్వామి తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వేను తిరిగి జరిపించాలి


తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**కల్లూరు, మేజర్‌న్యూస్:** తమ గ్రామంలో జరిగిన భూ రీసర్వే కార్యక్రమంలో తప్పులు జరిగాయని తిరిగి రీ సర్వే చేయించాలని కల్లూరు మండలం కె.మార్కాపురం రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ పాస్‌పుస్తకాలలో ఉన్న భూములను తప్పుగా రీసర్వే చేశారన్నారు. దీని వల్ల తమకు అన్యాయం జరిగిందన్నారు. దీనిపై విచారణ చేసి గ్రామంలో మరోసారి భూ రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు బచ్చు మద్దిలేటి, సుధాకర్, దస్తగిరి, అబ్దుల్లా, మద్దిలేటి, సోమనాయుడు, మల్లికార్జున, జయలక్ష్మి, రామానాయుడు నాగమ్మ, శాంతమ్మ, రామాంజనేయులు పాల్గొన్నారు.

# ఈ అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణాన్ని నిలిపివేయాలి

**నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్ :** డోన్ మండలం పట్టణానికి ప్రధాన రహదారిన డోన్ టు గోవర్ధనగిరి రోడ్డులో వెంకటనాయనిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రైల్వేగేట్ నెంబర్ 164/ఇను అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం నిలిపివేసి యధావిధిగా కొనసాగించాలని 15 గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ,గ్రామ ప్రజలు వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, తదితరులు మాట్లాడుతూ 15గ్రామ ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేని అండర్‌పాస్ బ్రిడ్జిని ఎందుకు వేస్తున్నారో అర్థం కావడం లేదని తెలిపారు. ప్రజల ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా హడావుడిగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. దీనివల్ల రైతులకు, ప్రజలకు రవాణా సౌకర్యం ఉండదని మల్యాల రై-ల్వే స్టేషన్ దగ్గర లింగందొడ్డి, పెండేకల్లు బోగోలు రైల్వే స్టేషన్ దగ్గర ఉన్నాయని ఎప్పుడూ నీరు తప్ప ఎలాంటి ఉపయోగం లేదన్నారు. రైల్వే అధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి ఆ పనుల నిర్మాణాన్ని నిలిపివేసి యధావిధిగా కొనసాగించేటట్టుగా అధికారులు చూడాలని లేనిపక్షంలో 15 గ్రామ ప్రజలు నిర్మాణాలను నిలిపివేసేందుకు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజే స్తున్న సీపీఐ, సర్పంచులు, ఎంపీటీసీలు

# అర్జీలను నిర్దేశిత గడువులో పరిష్కరిస్తాం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్:** స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్దేశిత సమయంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆన్‌లైన్ కోసం అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అర్జీలను ఆయా గ్రామ రెవెన్యూ అధికారులకు పంపి విచారించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఓంకార్‌యాదవ్, హౌసింగ్ ఏఈ రామయ్య, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించండి

**– జిల్లా కలెక్టర్ జి.సృజన**



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** జగనన్నకు చెబుదాం–స్పందన అర్జీలను అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.కృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ అందజేసేలా చర్యలు తీసుకోవడంతోపాటు అర్జీలకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ కార్యాలయాల వద్దకు పిలిపించి ఎండార్స్‌మెంట్స్ అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్ల చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌లో మధుసూధన్‌రావు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నాగప్రసన్నలక్ష్మి, రమ, అనురాధ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# టీడీపీ వస్తేనే భవన నిర్మాణ కార్మికులకు భవిష్యత్తు

**– కర్నూలు టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్**
**– టీడీపీలో చేరిన మహిళలు, యువకులు**



టీజీ భరత్ సమక్షంలో పార్టీలో చేరుతున్న మహిళలు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే భవన నిర్మాణ రంగం పుంజుకుంటుందని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని మౌర్య ఇన్‌లో 6వవార్డుకు చెందిన ఇబ్రహీం ఆధ్వర్యంలో ఫైరోజ్ బృందం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీజీ భరత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం టీజీ భరత్ మాట్లాడుతూ టీడీపీ హయంలో భవన నిర్మాణ కార్మికులకు మంచి పనులు ఉండేవన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తేనే కార్మికుల జీవితాలు మారుతాయన్నారు. కర్నూలులో తాను ఎమ్మెల్యే అవ్వగానే అన్ని రంగాల ప్రజలకు అండగా ఉంటానన్నారు. పార్టీలో చేరిన వారిలో పాష, షబ్బీర్, లతీఫ్, జహంగీర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మెహబూబ్, ఫయాజ్, అబ్దుల్‌రజాక్ పాల్గొన్నారు. అనంతరం నగరంఓలని 5వ వార్డుకు చెందిన మహిళలు కర్నూలు నియోజకవర్గ అసెంబ్లీ మహిళా కమిటీ నాయకురాలు సుశీలమ్మ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీల చేరారు. సులోచనమ్మ, వసుంధ, విశాలమ్మ, భార్గవి, తాజున్నీసా, శ్యామలమ్మలకు టీజీ భరత్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని టీజీ భరత్ సూచించారు. టీడీపీ వస్తే మహిళకలు ఎన్నో సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బాలు, శారద పాల్గొన్నారు.

# డంపుయార్డు బారీ నుంచి కాపాడండి సారూ..

**– తాగునీటి సరఫరా చేసే బావిలో వద్దే డంపు**
**– కలుషిత నీటితో రోగాలబారిన పడుతున్న కాలనీవాసులు**
**– అధికారుల నిర్లక్ష్యం పై రైతు సంఘం నాయకులు ఆగ్రహం**



వడ్లరామాపురం రస్తాలో ఏర్పాటు చేసిన డంపుయార్డు

**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** డంపుయార్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తాగునీటిని సరఫరా చేసే బావి వాగు గడ్డన ఉండడంతో చెత్తాచెదారంతో వివిధ రకాల వ్యర్థాలను వేయడం ద్వార వాగు నీటిలోకి వ్యర్థాలు చేరి నీరు కలుషతం అవుతుందని, అదే నీటిని శుద్ధిచేయకుండా సరఫరా చేయడం, డంపు నుంచి వచ్చే పొగ, దుర్వాసనతో రోగాల భారిన పడుతున్నామని పలు కాలనీలకు చెందిన ప్రజలు వాపోతున్నారు. సోమవారం రైతు సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు టపాల్ అస్రఫ్ అలి కాలనీ వాసులతో కలిసి డంపు యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపు యార్డుకు సమీప కాలనీలైన ఎస్సిజిపాలెం, కాకుల గడ్డ, తోటగేరితో పాటు మరిన్ని కాలనీలకు చెందిన ప్రజలు డంపు యార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడమే కాక నిర్లక్ష్య సమాధానం ఇస్తున్నట్లు ప్రజలు తెలిపారన్నారు. పట్టణానికి చెందిన పలు కాలనీలకు చెందిన ప్రజలు డంపుయార్డు వల్ల రోగాల భారిన పడుతున్నా అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతూ పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని ఊకదంపుడు ఉపన్యాసాలు, ప్రత్యేక చర్యలు చేపడుతున్న అధికారులకు డంపుయార్డుతో ఇబ్బందులు పడుతున్న కనిపించడం లేదా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తుంటే ప్రజలను రోగాల భారిన పడేలా చేస్తున్న డంపుయార్డు గురించి అధికారులు పట్టదా అని అన్నారు. రోడ్డు పక్కనే ఉండడం వల్ల అటుగా వెళ్లే రైతులు, వడ్లరామాపురం గ్రామ వాసులు పొగకమ్ముకోవడం వల్ల అనేక సార్లు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని లేదంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. త్వరలోనే ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం నాయకులు , వివిధ కాలనీల వాసులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు సోమవారం అడిషనల్ ఎస్పీ అడ్మిన్ టి.సర్కార్ స్పందన కార్యక్రమం నిర్వ హించారు. స్పందన కార్యక్రమానికి మొత్తం 60ఫిర్యాదులు వచ్చాయి.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..!**

– నందికొట్కూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.5 లక్షలు తీసుకొని కర్నూలు ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రసాద్‌రావు మోసం చేశాడని గుంతకల్లుకు చెందిన ఎర్రిస్వామి ఫిర్యాదు చేశారు.

– ప్రవీణ్, నాగన్నలు తనకు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.లక్ష తీసుకొని మోసం చేశారని కర్నూలు బుధవారపేటకు చెందిన ఎస్. నారాయణ ఫిర్యాదు చేశారు.

స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరిగతిన పరిష్కారిస్తామని టి.సర్కార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సీఐలు పాల్గొన్నారు.



# చిన్నారులను అభినందించిన టీజీ వెంకటేష్ దంపతులు



చిన్నారులను అభినందిస్తున్న టీజీ వెంకటేష్ దంపతులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** పంజాబ్‌లో జరిగిన జాతీయస్థాయి చిల్డ్రన్స్ ఫెస్టివల్‌లో ప్రతిభ కనబరచిన టీజీవీ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ చిన్నారులను తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ దంపతులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీజీవీ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు భార్గవ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ అకాడమీ చిన్నారులు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ కనబరచి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తమ అకాడవీ చిన్నారులు భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన విజయాలు సాధించేలా తీర్చిదిద్దుతామని అకాడమీ అధ్యక్షుడు భార్గవ్‌కుమార్ తెలిపారు.

# రబీలో 50శాతం పంటల సాగు

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** జిల్లాలో రబీ సీజన్‌లో రైతులు వివిధ రకాల పంటలను 50 శాతం సాగు చేశారు. జిల్లావ్యాప్తంగా 1,21,673హెక్టార్లలో ప్రధాన పంటలైన వరి, పప్పుసెనగ, మినుములు, సన్‌ఫ్లవర్, ఆముదాలు, వేరుసెనగ వంటివి సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. వాటిలో వరి 4,739హెక్టార్లలో సాగు చేస్తారని అంచనా వేయగా కేవలం 256 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. ప్రధానంగా రబీ సీజన్‌లో పప్పుసెనగ, వేరుసెనగ పంటలను అధిక శాతం సాగు చేస్తారు. పప్పు సెనగ 72,435హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 42,191హెక్టార్ల లోసాగు చేశారు. వేరుసెనగ 15,134హెక్టార్లు కాగా 6,485హెక్టార్లలో సాగు చేశారు. వాటితో పాటు జొన్న 12,238హెక్టార్లు కాగా 5,135హెక్టార్లలో, మొక్కజొన్న 5,737హెక్టార్లు కాగా 3,305హెక్టార్లు, కొర్ర 911హెక్టార్లు కాగా 240హెక్టార్లు, సజ్జ 649హెక్టార్లు కాగా 140హెక్టార్లు, మినుములు 567హెక్టార్లు కాగా 178హెక్టార్లు, కందులు 118హెక్టార్లు కాగా 19హెక్టార్లలో, సన్‌ఫ్లవర్ 458హెక్టార్లు 67హెక్టార్లలో, ఆముదాలు 132హెక్టార్లు కాగా 12హెక్టార్లలో సాగు చేశారు. ఉద్యానవన పంటలైన ఉల్లి 2,410హెక్టార్లు కాగా 1,143హెక్టార్లలో, వాము 1,532హెక్టార్లు కాగా 853హెక్టార్లు, మిర్చి 636హెక్టార్లు కాగా 598హెక్టార్లు, టమోటా 568హెక్టార్లు కాగా 54 హెక్టార్లలో, ఇతర పంటలు 1,417హెక్టార్లు కాగా 454హెక్టార్లలో సాగు చేశారు. అయితే ఈ రబీ సీజన్‌లో పొగాకు పంటను 1,498హెక్టార్లలో సాగు చేస్తారని అంచనా వేయగా 2,760హెక్టార్లలో రైతులు పంటను సాగు చేశారు.

# స్పందన అర్జీలకు సత్వర న్యాయం- జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి



వృద్ధురాలితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్ :** స్పందన కార్యక్రమంలో అర్జీదారులు ఇచ్చే ఫిర్యాదులను పరిష్కరించి వారికి సత్వర న్యాయం చేస్తామని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని బాధి తులను నుంచి నేరుగా ఫిర్యాదులను అందుకున్నారు. అక్కడికక్కడే పరిష్కారమయ్యే సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 90మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. ఫిర్యాదుల్లో ప్రధానంగా నూనెపల్లెకు చెందిన ఉరుకుంద అనే వ్యక్తి త న భార్య చిన్న లక్ష్మమ్మ పేరుమీద 18 సెంట్ల స్థలాన్ని డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయించాడని, అయితే అంతకు ముందే మరొకరికి ఆ స్థలాన్ని ప్లాట్లుగా విభజించి అమ్మేసి తమను మోసం చేశారని లింగాల చంద్రశేఖర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. తనవద్ద అన్నెం తిమ్మయ్య అనే వ్యక్తి రూ.48వేలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా వేదిస్తున్నాడని వెంకటేశ్వరపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. తనభార్యకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1.50లక్ష తీసుకుని విజయ్ అనే వ్యక్తి మోసం చేశాడని వెంకటాచలం కాలనీకి చెందిన ప్రదీప్ అనే వ్యక్తి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. స్పందన కార్యక్రమంలో తన సమస్యను జిల్లా ఎస్పీకి విన్నవించుకోవడానికి వచ్చిన నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిని గమనించి జిల్లా ఎస్పీ నేరుగా ఆమె వద్దకే వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆమె సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారులకు ఓంకారం దేవస్థానం వారు భోజన సదుపా యాన్ని కల్పించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ సంతోష్, నంద్యాల తాలుకా సీఐ దస్తగిరిబాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ సూర్యమౌళి పాల్గొన్నారు.

# నకిలీ సర్టిఫికెట్ల దందాను అరికట్టండి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** పశుసంవర్ధక శాఖ ఉద్యోగాల భర్తీలో నకిలీ సర్టిఫికెట్ల దందాను అరికట్టాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, రాయలసీ హక్కుల పోరాట సమితి, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి నాయకులు రాఘువేంద్ర, రంగప్ప, అబ్దుల్లా, సుంకన్న, వీవీనాయుడు, అశోక్ అన్నారు. సోమవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పశుసంవర్ధ శాఖ జాయింట్ డైరెక్టర్ రామచంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నకిలీ సర్టిఫికెట్లతో పశుసంవర్ధక శాఖలో ఉద్యోగాలు సంపాదించాలకున్న వారిపై విచారణ చేయాలన్నారు. సర్టిఫికెట్లు అందజేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థి సంఘాల నాయకులు మగ్బుల్, వెంకటేశ్వర్లు, సుధాకర్, జయరామ్, గోపాల్, హరి, రమేష్, మహబూబ్‌బాష పాల్గొన్నారు.